# కవితా కౌముది

## రూపం మార్చుకునే ప్రశ్న

డాక్టర్. నూకరాజు బెందుకుర్తి

ప్రశ్న మెల్లగా రూపం మార్చుకుంటుంది...
"నేనెవరు?" అన్న గట్టి రాయి నుంచి,
"నేను ఎలా తయారవుతున్నాను?" అన్న
ప్రవహించే నదికి.
ఇది కేవలం "నేనెవరో?" అనే ఒక్క తలపు
కాదు;
నీ గుండెల్లో చిన్న అలలలా తడుముకునే
మరో ప్రశ్నకు ప్రతిధ్వని
"నేను నేడు
నా లోపల నన్నే
ఎలా తిరిగి రాస్తున్నాను?"
మనిషి స్థిర చిత్రం కాదు,
ముగిసిన పుటల పుస్తకమూ కాదు;
అంతులేని కాన్వాస్‌పై
ఎప్పటికీ ఆగని రంగు వర్షం.
ఆ చిత్రంలో మెరుస్తూ వచ్చే చిహ్నాలు
జ్ఞాపకాల ముద్రలు,
ఇతరుల నిర్దేశాల నీడలు,
చెప్పలేని భావాల చుక్కలు,
తడబాటైన చర్యల గీతలు.
కానీ
ప్రతి బ్రష్ స్ట్రోకు చివర
నీ స్వంత హృదయ స్పందన వినిపించాలి;
అదే నీ రూపానికి గొప్ప రేఖ.
నీ స్వతంత్రత ...నువ్వే ఎంచుకున్న రంగు,
నీ నిజ జీవితం... ఆ రంగు కోసం ఎదురుచూస్తున్న గోడ.
ఈ రెండింటి సంగమ రేఖపై
నీ స్వంత చేతులే
నీ రూపానికి చివరి అక్షరం రాయాలి.
ప్రతి ఊహ, ప్రతి జ్ఞాపకం, ప్రతి నిర్ణయం
నీ ఆత్మకు మళ్లీ మళ్లీ రాయబడే ఉత్తరం;
ప్రతి ఉత్తరం చివర
కొంచెం భిన్నమైన సంతకం
"ఇదిగో, ఇదే నేటి నేను."
నీ కథ
నీ స్వరూపానికి వెలుపల నిలబడి చెప్పే చరిత్ర కాదు;
నీ కథే,
నీ ఆత్మ కంటిలో దర్శనమిచ్చే
నీ అసలు, ఎప్పటికీ తయారవుతూనే ఉండే స్వరూపం.

★★★



## మనసు రెక్కలగుఱ్ఱం
## నాగ్రాజ్

వాన పాట !
చెడ్డీలొక్కంటు కాగితప్పడవల్ని
నీటిలోవదిలి గెంతులేసిన
చిన్నప్పటి నన్ను పలకరిస్తుంది

జేబులో రూపాయి !
ఆకాశంలో నక్షత్రాలకి
నేలకు నిచ్చెనవేసే ప్రణాళిక
రచిస్తుంది

కన్నె వాసన!
ఎడారి దారిలో
ముళ్లపొదలకు
పరిమళాల పూలు పూయిస్తుంది

ఆశ!
మనిషిని వానరాన్ని చేసి
మహాసముద్రాలు
దూకిస్తుంది

మనసు రెక్కలగుఱ్ఱం
పగ్గాలు వదిలితే
విడదీయలేని
చిక్కుముడుల్లో బంధిస్తుంది

★★★

## చెలిమి
## రవిప్రసాద్ చెలమల్లు

పెదవి దాటని భావాలు -
మాటలై పొడిపొడిగా రాలుతాయి
మనసు దాటని ఆశలు -
కలలై కన్నుల్లో కురుస్తాయి
గడప దాటని అడుగులు -
కలలతీరాల్ని చుట్టేసి వస్తాయి

నేలను చేరుకోవాలనిపిస్తే
వేడిమిగానో, వెన్నెల గానో,
వర్షంగానో కురిసే నింగి,
సుడిగాలై నింగిని చుట్టేసే నేల,
అలలుగా చేరలేక ఆవిరిగా మారి
అంబరాన్ని అంటే కడలి

తరచి తరచి చూశాకే తెలిసింది
చేరువ అవ్వడమే చెలిమని

గతంలో వెతుక్కోవడం మాని
అస్థిత్వాన్ని వదులుకొనైనా,
కాలాలు, దూరాలు చెరిపేసి
ఖాళీలు పూరిస్తూ, మనసు నింపుకుంటూ
చెలిమి తీరం చేరుకుంటే సరి

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

పయనమునకిది గమ్యమ్ము భయమదేల?
సంద్రమున సాగు నావకు సార్థకమ్ము
అర్థమే లేదు తుదిలేని యానమునకు
ఎన్నడో పయనమును చాలింపవలయు

ఎగయు తరగలతోడ పైకెగిరి యెగిరి
జలధియలలతో క్రిందికి జారి జారి
సమతలమ్మ్ననొకపరి సాగి సాగి
అవగతము కాని పయనంపుటంచు చేర

మనసు వెనుకకు పిలిచి రమ్మనుచునుండు
తీరమును చేరనేముండు తెలియదంచు
పయనమే యద్భుతపుటనుభవమటంచు
కష్టసుఖముల బాటయే ఘనమటంచు

అంతయు ప్రశాంతమయము తీరాంతరమున
అప్సరోజనదివ్యలాస్యములు లేవు
ప్రచురభీషణక్రూరదంష్ట్రలును లేవు
పలుకరింపగ వచ్చు పూర్వజులు లేరు

తొలగె జీవితమ్మననొడుదుడుకులన్ని
స్మృతిపథమ్మననేమియు మిగులలేదు
బంధములు లేవు కనరావు వైరములును
కలకలము లేదు కలదు నిశ్చలసమాధి

COMMENTS